# సగంలో ముగింపు

"ఫోన్‌లో కంటే మీరు అందంగా వుంటారా?" కొంచెం ధైర్యంచేసి అడిగాను. అలా అడిగిన తర్వాత గుండె కొట్టుకునే వేగం పెరిగింది. వందన జవాబు చెప్పే లోపున.

"అవును, తప్పకుండా నాది ఫోటో జెనిక్‌ఫేసు కాదు. ఫోటోకి నేను పనికిరాను".

తేలిగ్గా నిట్టూర్చాను.

"ఐతే మిమ్మల్ని ఒకసారి చూడాలి"

"సారీ.... రాలేను"

"మరెలా?"

ఫోన్లో సంభాషణ జరుగుతుంది.

"ఆ పత్రికలో ప్రచురించిన మీ ఫోటో సరిగా రాలేదనుకుంటాను. విడిగా మీ ఫోటో ఒకటి పంపిస్తారా?"

ఇలా అడిగానంటే నా మనసులో ఏదో ఉండి ఉంటుంది. లేకపోతే ఆమె ఫోటోతో న కేమిటి పని?

"ఫోటోనా!!" ఆశ్చర్యపడుతున్నదానిలా అన్నది. బహుశ అలా అంటున్నప్పుడు ఇంట్లో కూర్చుని గుండెలమీద చెయ్యి వేసుకుని వుంటుంది.

"అవునండీ. మీ ఫోటో" వొత్తి పలికేను కావాలనే.

"నా ఫోటో పంపించటం మంచి పనేనంటారా?" నన్నే అడిగింది. "మీ అంతరాత్మ నడగండి. మంచి పనేనని అనిపిస్తే పంపించండి. పంపకపోతే మీ అంతరాత్మ అంగీకరించలేదని అనుకుంటాను. నో ప్రెజర్" అన్నాను వెంటనే. అప్పుడప్పుడు నేను కొంచెం మొండిగా వుంటాను.

ఆలోచిస్తానని సంభాషణను నిలిపివేసింది. ఏదో వెలితిగా అనిపించింది. తల్చుకుంటే చిత్రంగా ఉంది. వందన ఒక రచయిత్రి, ఒక పత్రికలో ఆమె రాసిన కథను చదివి అందులో ఆమె ఫోటో అడ్రసుతో పాటు, ఫోన్ నెంబర్ కూడా ఉండటంతో కథను మెచ్చుకుంటూ ఉత్తరం రాశాను. అందులో నా ఫోన్ నెంబర్ రాయటంతో ఆ ఉత్తరాన్ని చదువుకుని నాకు ఫోన్ చేసి థ్యాంక్స్ చెప్పింది. అంతటితో వూరుకోలేదు.

రోజుకు ఒక్కసారయినా ఫోన్ చేసి నాతో మాట్లాడేది. తను కొత్తగా రాస్తున్న కథల గురించి, తను చదివిన కథల గురించీ, ఇంకా పాత సినిమాల గురించీ,

పాటల సాహిత్యం గురించి.

బాగానే వుంది. ఆమె చెప్పేదంతా వింటున్నాను.

ఉన్నట్టుండి ఒకసారి ఫోన్ చేసి "నేను విజయవాడకు వస్తున్నాను" అని చెప్పింది. రమ్మన్నాను.

కానీ రాలేదు. మళ్లీ ఫోన్ చేసి రావటంలేదని చెప్పింది. అప్పుడు ఫోటో గురించి అడిగాను.

ఇలా అడిగిన తర్వాత ఫోటో పంపలేదు. నాలో అదోవిధమైన టెన్షన్.

నా మనసులో ఏదో ఉందని అనుకుంటున్నదానికి అనుగుణంగా ఆమె స్పందిస్తుందా? లేదా?

చిన్నతనంలో క్లాసు పుస్తకం తెరిచి పక్కవాడితో ఆడిన బొమ్మ వస్తుందా? రాదో? ఆట గుర్తుకువచ్చింది.

వందన ఫోటో పంపుతుందా? పంపదా?

నిజానికి నా ఉత్తరానికి ఆమె థ్యాంక్స్ చెప్పటంతో ఈ కథ ఆగిపోవాలి. కానీ అంతటితో ఆగలేదు. కొనసాగుతూనే వుంది. వందనే కథను పొడిగిస్తోంది రాత్రిళ్లు కూడా ఫోన్ చేస్తూ ఎందుకు? ఆమె మనసులో కూడా ఏమైనా వుందా?

వందన మనసులో ఏముందో తెలీదు. తెలుసుకోవాలనే ప్రయత్నంలో వున్నాను. కానీ తెలీటం లేదు.

ఆమె తన ఫోటోను పంపితే కొంతవరకు తెలిసిపోతుంది. ఎందుకంటే ఇలాంటి పరిచయం వున్న మగాడికి ఏ ఆడది తన ఫోటోను పంపించదు కాబట్టి.

ఒకవేళ పంపితే?

ఏదో వుందని అనుకోవచ్చు.

నేనిలా అనుకుంటున్నప్పుడే ఒక రోజు వందన నించి పోసుటలో ఒక కవరు వచ్చింది.

ఆత్రంగా ఓపెన్ చేసి అందులోనించి ఒక కార్డుసైజు ఫోటోను బయటకు తీశాను.

ఫోటో చూడగానే మతిపోయింది.

ఆ ఫోటో వందన ఫోటో కాదు.

నాకెలా తెలుసంటే? ఆమె పంపిన ఫోటో రేవతిది. రేవతి నాకు బాగా తెలుసు. పెళ్లయ్యేవరకు మా పక్కవీధిలో వుండేది. ఆమె మా ఇంటి ముందునుంచి వెళుతున్నప్పుడు చాలాసార్లు చూశాను. అందుకే ఆ ఫోటోని గుర్తుపట్టగలిగాను.

వందన ఎందుకిలా చేసింది?

ఆమె ఉద్దేశం ఏమిటి? రేవతివాళ్లు విశాఖపట్నంలో వుంటున్నారని నాకు తెలుసు. వాళ్లిద్దరూ స్నేహితులయి వుంటారు.

రేవతి ఫోటోని ఎలాగో సంపాదించి నాకు పంపించింది. వందన నుండి ఫోన్ కాల్.

"మీ కోరిక తీరిందా?" పరిహాసపు నవ్వు.

"నా ఫోటో బావుందా?"

"ఏమిటీ మౌనం వహించారు? మాట్లాడండి" నవ్వుతూనే అడుగుతోంది.

"ఏం మాట్లాడమంటారు?" గొంతు పెగుల్చుకుని అడిగాను.

"ఫోటో బావుందా?"

"మీరు పంపిన రేవతి ఫోటో చాలా బావుంది" కొంచెం కసిగానే అన్నాను. షాక్ ఫీలయి వుంటుంది. మూగబోయింది.

అవతలివైపు నిశ్శబ్దం అలుముకుంది.

"రేవతి మీకు తెలుసా?" హఠాత్తుగా అడిగింది.

"బాగా తెలుసు. అక్కడకు రాకముందు మా వీధిలోనే వుండేది"

"సారీ.... ఇలా చెయ్యక తప్పలేదు"

"ఎందుకో చెబుతారా?"

"నా ఫేసు బావుండదు. నా ఫోటో చూసి మీరు నిరుత్సాహపడకూడదని నా స్నేహితురాలి ఫోటోను పంపించాను. సారీ...." అన్నది.

వందన గురించి ఏమనుకోవాలో తెలియక ఆలోచిస్తు ఇప్పుడు "ఇంకో విషయం" పత్రికలో మీరు చూసిన ఫోటో కూడా నాది కాదు. నా చెల్లెలు అంజలిది. నేను ఆ ఫోటోలో వున్నట్టు ఉంటానని అనుకోకండి" అన్నది వందన.

అంతటితో కథ ముగియలేదు.

ఇంకో నాలుగు రోజులకు ఆమె నుంచి ఒక ఉత్తరం వచ్చింది.

అసలు నిజం రాస్తున్నాను. నా కళ్లలో ఒక కన్ను మూసుకుపోయి వుంటుంది. పుట్టుకనించీ అంతే, అందుకే మీకు నా ఫోటోను పంపించలేదని మీరు గ్రహిస్తే మంచిది. ఇకనుంచి మీరు నాకు ఫోన్ చెయ్యరనుకుంటాను అంది వందన.

ఆమె ఆలోచన నిజమే. ఆ తర్వాత నేనెప్పుడూ వందనకు ఫోన్ చెయ్యలేదు.

❖

*ఆశ మాసపత్రిక, ఏప్రిల్ 2011*